క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన చెరక గోపాల్ సెల్‌ఫోన్ ఇటీవల పోగొట్టుకున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎస్‌ఐ శ్రీహరి సీఈఐఆర్ టెక్నాలజీ ద్వార సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రూ.15,500 విలువ గల ఫోన్‌ను పోలీసులు మంగళవారం ఫిర్యాదుదారుడు గోపాల్‌కు అప్పగించారు. దీంతో ఆయన ఎస్‌ఐ శ్రీహరి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైన కొత్తగా సెల్‌ఫోన్ కొంటే దానికి సంబంధించిన బాక్స్, బిల్లు జాగ్రత్తగా ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. వాటి ఆధారంగా సెల్ ఎక్కడ ఉన్నది గుర్తించే వీలు ఉంటుందన్నారు.

రైతులను ఆదుకోవాలి



వనపర్తి క్రైం: మండలంలోని చందాపూర్ శివారులో ఎండిన వరి పంటలను బీజేపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ మాట్లాడుతూ అప్పులు తెచ్చి సాగు చేసిన వరి పంటకు సాగునీరు లేక ఎండిపోతున్నాయని, దీని వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు ఉన్నారు.

కంటివెలుగు శిబిరం



పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండాలో కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం మండల ప్రత్యేకాధికారి సురేష్ సర్పంచ్ దేవీసింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి వెలుగు శిబిరంపై గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాం, పంచాయతీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మనిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 140మంది విద్యార్థులకు 41రోజుల పాటు అల్పాహారం అందించిన రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ(ఆర్డీఎస్) సభ్యులను మంగళవారం ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు చిన్నమ్మ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థుల శ్రేయస్సు కోసం పనిచేస్తామని, సంస్థ తరఫున ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తామస్, జ్యోతి, శ్రీలక్ష్మి, హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, విజయ్‌కుమార్, సురేఖ, చంద్రకళ, శ్రీరామ్, దివ్య ఉన్నారు.

బార్ కౌన్సిల్ అధ్యక్షుడికి..



వనపర్తి టౌన్: జిల్లా బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మోహన్‌కుమార్ యాదవ్‌ను మున్సిపల్ పాలకమండలి ఆధ్వర్యంలో చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్‌యాదవ్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేసి, అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కంచరవి, నాగన్నయాదవ్, పాకనాటి కృష్ణ, గోపాల్ యాదవ్, నక్క రాములు, మహేష్, బీచుపల్లి యాదవ్, ఫైర్ స్టేషన్ నరసింహ, మహేష్, చీర్ల సత్యం సాగర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతువేదికలో ఫ్యాన్లు చోరీ

చిన్నచింతకుంట: మండలంలోని ఉంద్యాల రైతువేదికలో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్యాన్లు చోరీ చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. గ్రామంలోని రైతువేదికలో ఆరు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్యాన్లను దొంగిలించారు. ఏఈఓ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి

అమరచింత: ఆత్మకూర్ పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను చేపడుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రతి వార్డును సంపూర్ణంగా పారిశుద్ధ్యం గల వార్డుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి వార్డులో ఐదు రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులతో పరిసరాలను పరిశుభ్రం చేయించే పనులు చేపడుతున్నామని తెలిపారు. మురుగుకాల్వల శుభ్రతతో పాటు చెత్తచెదారం లేని పట్టణంగా మార్చేందుకు వార్డు కౌన్సిలర్లు సహకరించాలన్నారు. పట్టణంలో కొత్తగా విద్యుత్ లైన్ మార్పిడి పనులతో పాటు రోడ్ డివైడర్ పనులు, సీసీ రహదారుల పనులను త్వరితంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్ పోసన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 3, 4వ వార్డులో పారిశుద్ధ్యం నిర్వహణపై మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో తిరుగుతూ కార్మికులతో మురికి కాల్వలు, రహదారులు శుభ్రం చేయించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను మున్సిపల్ ట్రాక్టర్‌కు అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతి, సువర్ణ, అశ్విని, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్ బాబు, వార్డు స్పెషల్ అధికారులు గంగన్న, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో..

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



పెబ్బేరులో ఇఫ్తార్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



శ్రీరంగాపురంలో..

పెబ్బేరు: యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం పట్టణ కేంద్రంలోని సహారా ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నియమనిష్ఠలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, నరేందర్, గంధం రాజశేఖర్, సత్యనారాయణ, వెంకట్రాములు, కౌన్సిలర్ ఎల్లస్వామి, సర్వేష్, డైరెక్టర్ రాములు, మహేందర్‌గౌడ్, ఎండీ షకీల్, సాయిగౌడ్, జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి చిన్నారెడ్డి హాజరై ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు దివాకర్ యాదవ్, రాములుయాదవ్, విష్ణు, రామచంద్రయ్య, వేముల శ్రీధర్, రాములు, ఆశన్న, పురుషోత్తంయాదవ్, రఘు, ఇమ్రాన్, జావీద్, నవీన్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు నివారణ



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమరచింత: వేసవిలో అప్రమత్తంగా ఉంటూ అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని ఆత్మకూర్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆత్మకూర్ పట్టణంలోని ఎల్‌పీజీ గ్యాస్ గోదాం, పెట్రోల్ బంక్‌లో మంగళవారం అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ వాసన వస్తున్నప్పుడు అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలి, ప్రమాదం నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరించారు. పెట్రోల్ బంక్‌ల్లో అతి జాగ్రత్తగా ఉండాలని, పెట్రోల్ పోయించుకునేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, సిగరెట్ తాగడం లాంటి పనులు చేయొద్దని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న విషయాలను వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నరేష్ గౌడ్, సందీప్ రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్‌నరసింహ, భానుచందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడుదాం



వనపర్తి బంగ్లాను సందర్శించిన సాహితీ కళావేదిక సభ్యులు

వనపర్తి క్రైం: తరతరాల మన చరిత్రకు ఆధారమైన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి పౌరుడిపై ఉందని సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజబంగ్లాను వారు సందర్శించారు. జిల్లాకు ఘనచరిత్ర ఉందని, పెద్దమారూర్, చిన్నమారూర్, ఈర్లదిన్నె శిలాయుగపు సమాధులు, ఆదిమానవుడి ఆవాసాలకు నిలయమైనదని అన్నారు. దురాశపరులు గుప్తనిధుల కోసం తవ్వి నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖిల్లాఘనపురం దుర్గాలను సంరక్షించి పర్యాటక ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించాలని వారు కోరారు. కార్యక్రమంలో బైరోజు చంద్రశేఖర్, శ్యాం సుందర్, శ్రీనివాసులు, నాగరాజు, బుచ్చిబాబు, స్వామి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఏడు కాళ్లతో మేక పిల్ల జననం

పాన్‌గల్: మండల కేంద్రంలోని గొర్రెల కాపరి మంగదొడ్డి బిచ్చన్న గొర్రెల మందలో మంగళవారం ఏడు కాళ్లతో వింత మేక పిల్ల జన్మించింది. వింత మేక పిల్ల నడుము భాగంలో మరో నడుము ఉన్న మేక పిల్లకు మొత్తం ఏడు కాళ్లు ఉన్నాయని కాపరి పేర్కొన్నారు. జన్మనిచ్చిన అరగంటకే మేక పిల్ల చనిపోయిందన్నారు. వింతగా జన్మనిచ్చిన మేక పిల్లను గ్రామస్తులు వింతగా చూస్తూ కనిపించారు. దీనిపై మండల పశువైద్యాధికారి డా.శ్యామ్‌ను వివరణ కోరగా.. ఇలాంటి వింత మేక పిల్లలు జన్యులోపం కారణంగా అరుదుగా జన్మిస్తుంటాయని, జనన సమయంలో విభజన జరిగి విడిపోయి కవలలుగా జన్మించాలి. కానీ అలాకాకుండా ఇలా జన్మించడంతో ఎక్కువ కాలం బతకలేవు అన్నారు.

నేడు సీపీఆర్‌పై అవగాహన

ఖిల్లాఘనపురం: గుండెపోటు వచ్చిన వ్యక్తికి అత్యవసర సమయంలో చేసే సీపీఆర్ విధానంపై బుధవారం ఉదయం 11 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్, వైద్యులు నర్సింహులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో వెంకటాంపల్లి రోడ్డుకు ఉన్న రైతువేదికలో మండల వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మండల స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని వారు కోరారు. శిక్షణ ఇచ్చేందుకు జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక నిపుణులు వస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



అమరచింత: ఆత్మకూర్ పట్టణంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. పట్టణంలో రమేష్‌యాదవ్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించే మూడు రోజుల క్రికెట్ పోటీలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపు, ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రమేష్, కౌన్సిలర్ పోషన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన మొగులాలు ఇటీవల కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. విషయం తెలుసుకున్న బీజేపీ వనపర్తి జిల్లా యువమోర్చా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి తనవంతుగా రూ.ఐదువేలు పంపగా సురేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో శంకర్, హరీష్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

అమరచింత: షార్ట్‌సర్క్యూట్‌తో ఆత్మకూర్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మబ్బుల నాగరాజ్ ఇంట్లోని గృహోపకరణాలు నిప్పంటుకున్నాయి. విషయాన్ని ఫైర్ అధికారులకు తెలియచేసినా అగ్నిమాపక యంత్రం వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మబ్బుల నాగరాజు ఇంట్లోని స్విచ్ బోర్డులో మంటలు చెలరేగి ఇంట్లోని వస్తువులు, బియ్యం, రూ.ఆరువేల నగదు, మూడు పట్టు చీరలు తగలబడిపోయాయని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ కాలనీకి వెళ్లి బాధితుడు నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయంగా రూ.పదివేలు అందించారు.

బెంబేలెత్తిస్తున్న 'గ్రామ సింహాలు'

- పట్టణంలో విచ్చలవిడిగా ఊరకుక్కలు
- కుక్కకాటుకు మరో యువకుడికి గాయాలు
- నివారణ చర్యలు చేపట్టని మున్సిపల్ పాలక మండలి



అమరచింత ఎనిమిదో వార్డు మటన్ మార్కెట్ రోడ్డులో ఊరకుక్కలు

అమరచింత: రెండు రోజుల వ్యవధిలోనే పట్టణంలోని ఎనిమిదవ వార్డులో ఇద్దరు యువకులు కుక్కకాటుకు గురయ్యారు. మంగళవారం పిల్లలను బడికి తీసుకెళ్తున్న కాడిగి లక్ష్మణ్‌పై కుక్కలు దాడి చేసి కాలి పిక్కలను కొరకడంతో రక్తగాయాలు అయ్యాయి. వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స అందించారు. ఇలా పట్టణంలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని పాత కల్లుగేరి, మటన్ మార్కెట్ ప్రాంతాల్లో ఊరకుక్కల బెడద పెరిగిపోతుంది. పాత మార్కెట్ ప్రాంతంలోనే కూరగాయలు, చేపలు, మాంసం, కోడి మాంసం దొరుకుతుండటంతో పట్టణంలోని ప్రజలు అధిక సంఖ్యలో అక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కుక్కలతో పాటు పందుల మంద సైతం ఇక్కడే ఉండటంతో ప్రజలు తినుబండరాలు, మాంసం, కూరగాయలు తీసుకెళ్తున్న సమయంలో వారిపై దాడిచేసి వాటిని లాక్కుతినే పరిస్థితులు దాపరించాయి. పందులను నివారించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుతం పందులకు తోడు కుక్కలు సైతం మనుషులపై దాడి చేస్తుండడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్ రహదారితో పాటు అన్ని వార్డుల్లో ఊర కుక్కలు అధికంగా సంచరిస్తూ తమ సంతతిని పెంచుకుంటున్న మున్సిపల్ అధికారులు, పశువైద్యాధికారులు వాటిని నియంత్రించలేక పోతున్నారు. మటన్ మార్కెట్ కలిగిన ఎనిమిదో వార్డులోనే అత్యధికంగా కుక్కలు సంచరిస్తూ ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి.

అధికారుల్లో చలనం శూన్యం

అన్ని మున్సిపాలిటీల్లో వీధి కుక్కలను అరికట్టడానికి చర్యలు తీసుకున్నా అమరచింత పట్టణంలో మాత్రం వాటిని అరికట్టేందుకు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వనపర్తి, ఆత్మకూర్ మున్సిపాలిటీల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకున్నా ఇప్పటికీ పట్టణ పరిస్థితులను పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను, పందులను నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జయప్రకాష్‌నారాయణ

పెబ్బేరు: హైదరాబాద్ రవీంద్రభారతిలో 16న జరిగిన ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి అభ్యాసోత్సవ్‌లో మాస్టర్ మైండ్స్ ఒలింపియాడ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మంగళవారం పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ రకాల ఒలంపియాడ్ పరీక్షలు రామానుజన్ మాథ్స్ మహోత్సవ్, రామన్ సైన్స్ మహోత్సవ్, ఆర్యభట్ట మెంట్ ఎబిలిటీ టెస్ట్, బోస్ మెడికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లాంటి విభాగాల్లో మొదటి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను లోక్‌సత్తా ప్రెసిడెంట్ జయప్రకాష్ నారాయణ అభినందించి, మెమొంటోలను అందజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి పని ప్రదేశంలోనే అంబలి, చలివేంద్రాల ఏర్పాటు



కూలీలకు అంబలి అందిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాన్‌గల్: ఉపాధి కూలీల ఇబ్బందులను గమనించిన తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ తన సొంత ఖర్చులతో ఉపాధి పనులు జరిగే ప్రాంతంలోనే అంబలి, చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మంగళవారం పనులు జరిగే ప్రాంతంలో అంబలి, చలివేంద్రం, కూలీలకు నీడను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఉపాధి పనుల వద్ద ఏర్పాటు చేసిన వసతులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పని

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్ కోరారు. మంగళవారం తండాలో ఆయన ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు కల్పించే వసతులపై ఆరా తీశారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 20వ తేదీన మండల కేంద్రంలో కూలీలతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లానాయక్, చిట్టెమ్మ, కూలీలు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ



కరపత్రాలు విడుదల చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

వనపర్తి టౌన్: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో మహబూబాబాద్ కార్యక్రమానికి దివ్యాంగులు తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వీహెచ్‌పీఎస్ సమావేశ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 26న వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి గంధం లక్ష్మయ్య, పట్టణాధ్యక్షుడు శ్రీనివాసునాయుడు, కార్యదర్శులు చంద్రశేఖర్, కుశకుమార్, నాగేషు, కురుమూర్తి, విజయ్, గంధం చంద్రయ్య, మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సమ్మె



మదనాపురంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఏఓల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి ప్రదర్శించడం తగదంటూ సీఐటీయూ మండల కార్యదర్శి మహేందర్ అన్నారు. ఆత్మకూర్, అమరచింతలోని ఐకేపీ కార్యాలయాల ఎదుట ఐకేపీ వీఓఏలు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్చల పేరిట కాలయాపన చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఓఏల మండల అధ్యక్షురాలు ఇందిరావతి, కురుమూర్తి, బాలస్వామి, రవి, ధనుంజయగౌడ్, భార్గవ్, పల్లవి, శ్రీలత, పద్మ, రాధిక, పావని, రంగన్న, రాధ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజగౌడ్, శేషయ్య, బాలరాజు, శ్రీనివాసులు, రాజు, భాగ్యమ్మ, శశికళ, పద్మ, లక్ష్మి, వెంకటయ్య, కృష్ణయ్య, నరేష్, రమేష్ పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట: ఐకేపీ వీఓఏలకు న్యాయం చేసేవరకు విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని ఐకేపీ వీఓఏల మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం వారు స్థానిక మహిళా సమాఖ్య భవనం ఎదుట సంఘాల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగారు.

మదనాపురం: వీఓఏలు చేస్తున్న సమ్మె మంగళవారం రెండోరోజుకు చేరింది. ఈసందర్భంగా వీఓఏలు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వారి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ 19ఏళ్లుగా గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న వీఓఏలకు భరోసా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో వీఓఏలు రాధ, అలివేల, అరుణ, స్వప్న, శ్రీలత తదితరులు ఉన్నారు.

పని కల్పించాలి

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లోని కూలీలందరికీ ఉపాధి పని కల్పించాలని జెడ్పీసీఈఓ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం దేవల్‌తిరుమలాపూర్‌లో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో ఆమె మాట్లాడారు. పనికోసం వచ్చే కూలీలకు జాబ్‌కార్డులను అందజేసి పని కల్పించే బాధ్యత ఎంపీడీఓలపై ఉందని అన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పనుల వద్ద తాగు నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గతంలో నాటిన మొక్కలకు నీరు పోయాలన్నారు.